## క్లుప్తంగా

### స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌ను కలిసిన నాయకులు



చైర్మన్ శివసేనారెడ్డిని సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**జమ్మికుంట:** తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డిని జమ్మికుంట పట్టణానికి చెందిన టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ జాయింట్ కన్వీనర్ దొంత రమేశ్, శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ దేశిని కోటి, నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, సన్మానించారు.

### ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడికి సన్మానం



సంజీవరెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

**వీణవంక:** ఎంపీటీసీ సభ్యుడిగా, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా ఐదేళ్లపాటు సేవ చేసే భాగ్యం కలిగినందుకు ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని వీణవంక మండలంలోని ఘన్ముక్కుల ఎంపీటీసీ మాజీ సభ్యుడు నాగిడి సంజీవరెడ్డి అన్నారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామస్తులు ఆయనకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ.. ఎంపీటీసీ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేశానని, గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండి, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని తెలిపారు. అనంతరం గ్రామస్తులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి శ్రీధర్, సింగిల్‌విండో డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పరామర్శ

**రామడుగు:** మండలంలోని వెలిచాల పరిధి గుడ్డివెలుగులపల్లికి చెందిన ఉప్పు వీరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. బాధిత కుటుంబసభ్యులను రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు బుధవారం పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీర్ల రవీందర్‌రావు, మాజీ ఉపసర్పంచ్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

### జీపీల సిబ్బంది ఆందోళన



తహసీల్దార్ అనుపమకు వినతిపత్రం ఇస్తున్న సిబ్బంది

**శంకరపట్నం:** వేతనాలు పెంచాలని కోరుతూ శంకరపట్నం మండలంలోని గ్రామ పంచాయతీల సిబ్బంది బుధవారం ఆందోళన చేపట్టారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించడం కష్టంగా ఉందన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ అనుపమకు వినతిపత్రం అందించారు.

### క్వింటాల్ పత్తి రూ.7,600

**జమ్మికుంట:** జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర గరిష్టంగా రూ.7,600 పలికింది. బుధవారం మార్కెట్‌కు 17వాహనాల్లో 293 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు. మోడల్ ధర రూ.7,500, కనిష్ట ధర రూ.7,400కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. క్రయవిక్రయాలను కార్యదర్శి గుగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

### ఆభరణాలు తస్కరించిన వ్యక్తికి జైలు

**చిగురుమామిడి:** కొండాపూర్ గ్రామానికి చెందిన దరిపెల్లి లచ్చవ్వను నమ్మించి, ఆమె చెవులకు ఉన్న బంగారు ఆభరణాలను తస్కరించిన పర్వతం రాజుకు కరీంనగర్ ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ 8 నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు చిగురుమామిడి ఎస్సై బి.రాజేశ్ తెలిపారు. బుధవారం సాయంత్రం విలేకర్లతో మాట్లాడారు. ఆయన వివరాల ప్రకారం.. లచ్చవ్వ వద్దకు గత సంవత్సరం నవంబర్ 8వ తేదీన పల్సర్ బైక్‌పై పర్వతం రాజు అనే వ్యక్తి వచ్చాడు. గ్యాస్ సిలిండర్ మంజూరైందని, ఫొటో తీయాలని, చెవులకున్న ఆభరణాలను తీసి పక్కన పెట్టాలన్నాడు. లచ్చవ్వ ఆభరణాలను తీసి పక్కన పెట్టింది. నీకు వచ్చిన సిలిండర్‌ను ఇంట్లోకి తీసుకెళ్లమని రాజు నమ్మబలికాడు. ఆమె సిలిండర్‌ను ఇంట్లోకి తీసుకెళ్లిన మరుక్షణమే రాజు అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పర్వతం రాజును పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారించిన ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి రాజుకు జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

# నిలిచిన పనులు.. తరచూ ప్రమాదాలు

- ఆగిపోయిన ఇందుర్తి–గాగిరెడ్డిపల్లి బీటీ రోడ్డు విస్తరణ
- 10 కిలోమీటర్లకు గానూ 3 కిలోమీటర్లే పూర్తి
- 5 కిలోమీటర్ల మేర కంకరపోసి, వదిలేసిన కాంట్రాక్టర్
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



ఇందుర్తి–గాగిరెడ్డిపల్లి మధ్య పోసిన కంకర

**చిగురుమామిడి:** మండలంలోని ఇందుర్తి–గాగిరెడ్డిపల్లి మధ్య బీటీ రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోవడంతో రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారిగుండా హుస్నాబాద్, చిగురుమామిడి, కరీంనగర్ తదితర ప్రాంతాలకు పనుల నిమిత్తం వెళ్తామని, కంకర పోసి వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రూ.15 కోట్లు మంజూరు..**

ఇందుర్తి–గాగిరెడ్డిపల్లి–సుందరగిరి గ్రామాల మధ్య 10 కిలోమీటర్ల బీటీ రోడ్డు విస్తరణకు అప్పటి ఎంపీ, ప్రస్తుత కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ 2021–22లో తన కోటా నిధుల నుంచి రూ.15 కోట్లు మంజూరు చేశారు. ఇందుర్తి నుంచి సంగోజీపేట చెరువు కట్ట వరకు మట్టిరోడ్డు ఉంది. గాగిరెడ్డిపల్లి నుంచి సుందరగిరి వరకు సింగిల్ రోడ్ ఉండేది. వాటిని విస్తరిస్తూ బీటీ రోడ్డు పనులు చేపట్టాలని ఆయన ఆదేశించారు. కానీ, పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ సుందరగిరి నుంచి 3 కిలోమీటర్ల మేర మాత్రమే పూర్తి చేశారు. మిగతా 7 కిలోమీటర్లకుగానూ 5 కిలోమీటర్ల వరకు కంకర పోసి, వదిలేశారు. దీంతో సైకిళ్లు, ద్విచక్రవాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పనులు మొదలు పెట్టి ఏడాది దాటినా పూర్తి చేయడం లేదని ప్రజలు వాపోతున్నారు.

**బైక్‌లు అదుపుతప్పి ముగ్గురికి గాయాలు..**

ఇందుర్తి, గాగిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన బెజ్జంకి వెంకటయ్య, అప్పాల మల్లయ్య, మరో గ్రామానికి చెందిన ప్రయాణికుడు కంకర దారిపై ద్విచక్ర వాహనాలు అదుపుతప్పడంతో గాయపడ్డారు. అయినా, కాంట్రాక్టర్‌లో చలనం రావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

**సర్వసభ్య సమావేశంలో నిరసన**

రోడ్డు విస్తరణ పనుల నిలిపివేతపై ఇందుర్తి, గాగిరెడ్డిపల్లి గ్రామాల ఎంపీటీసీ సభ్యురాలు అందె స్వప్న గత మూడు సర్వసభ్య సమావేశాల్లో నిరసన తెలిపారు. తోటి సభ్యులు కూడా ఆమెకు మద్దతు పలికారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల తీరుపై మండిపడ్డారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు.

**నేషనల్ హైవే అథారిటీ ఈఈకి ఫిర్యాదు**

బీటీ రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఈ నెల 3న నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఈఈ కృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. అయినా పనులు ప్రారంభం కాలేదు. రోడ్డు రోలర్, ఇతర వాహనాలను కాంట్రాక్టర్ తీసుకెళ్లడంతో పనులు ఇంకెంతకాలం నిలిచిపోతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

### రెండు, మూడు రోజుల్లో ప్రారంభిస్తాం

అనివార్య కారణాల వల్ల బీటీ రోడ్డు పనులు నిలిచిపోయాయి. వర్షాలు పడటం వల్ల కంకర తడిసిపోయింది. బీటీ వేసినా నిలవదని ఊరుకున్నాం. రెండు, మూడు రోజుల్లో పనులు ప్రారంభించి, పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– అనురాగ్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, కరీంనగర్

### బ్లాక్ లిస్టులో పెట్టాలి



కాంట్రాక్టర్ రోడ్డు విస్తరణ పనులను మధ్యలోనే వదిలేయడం దారుణం. తక్షణమే ప్రభుత్వం అతన్ని బ్లాక్ లిస్టులో పెట్టాలి. నేను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. స్వయంగా కేంద్ర మంత్రి చెప్పినా పనులు ముందుకు సాగడం లేదు.

– అందె స్వప్న, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు, ఇందుర్తి

### లైసెన్స్ రద్దు చేయాలి



ఇందుర్తి–గాగిరెడ్డిపలి–సుందరగిరి మధ్య నిలిచిపోయిన బీటీ రోడ్డు పనులను 20 రోజుల్లో పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. లేకపోతే పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ లైసెన్స్‌ను రద్దు చేసి, మరొకరికి అప్పగించాలి.

– మంద శ్రీనివాస్, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు, గాగిరెడ్డిపల్లి

# డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

- పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొద్దు
- హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

**శంకరపట్నం:** మనుషుల ప్రాణాలు విలువైనవని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం రోడ్డు ప్రమాదాలపై డ్రైవర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కేశవపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి పనులు చేస్తున్న టిప్పర్ల వల్ల ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని, 14 మంది దివ్యాంగులయ్యారని తెలిపారు. ఈ ప్రమాదాలు అతివేగం, నిర్లక్ష్యం వల్లే జరిగాయన్నారు. ఆటోడ్రైవర్లు పరిమితికి ప్రయాణికును తీసుకెళ్లొద్దని సూచించారు. ప్రమాదాల నివారణకు పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని డీబీఎల్ కంపెనీకి సూచించారు. కొత్తగా వచ్చిన బీఎన్ఎస్ చట్టం కఠినంగా ఉందని, డ్రైవర్లు నిబంధనలు పాటించి డ్రైవింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ వెంకటి, ఎస్సై లక్ష్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# సాంకేతిక నైపుణ్యం పెంచుకోండి

- జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు, ట్రైనర్ రత్నప్రియ



విద్యార్థులకు శిక్షణనిస్తున్న ట్రైనర్ రత్నప్రియ

**తిమ్మాపూర్:** ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యం పెంచుకుంటేనే పోటీ ప్రపంచంలో రాణించగలుగుతారని జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు, టెక్నికల్ అసోసియేట్ ట్రైనర్ రత్నప్రియ అన్నారు. తిమ్మాపూర్‌లోని జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(అటానమస్) కళాశాలలో ఈ నెల 8 నుంచి నిర్వహిస్తున్న టాస్క్ శిక్షణ బుధవారం ముగిసింది. పైథాన్ ప్రోగ్రాం బేసిక్స్ నుంచి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ అంశాలను వెబ్, స్కాపింగ్, డిజాంగో తదితరాపై ట్రైనర్ శిక్షణనిచ్చారు. ముగింపు కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఈ శిక్షణను బయట తీసుకోవాలంటే పెద్ద మొత్తంలో ఖర్చవుతుందని తెలిపారు. టాస్క్‌లో రిజిస్టర్ చేసుకున్నవారికి కళాశాలలో అనుభవజ్ఞులైన ట్రైనర్ ద్వారా శిక్షణ ఇప్పించామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, కార్పొరేట్ సంస్థల్లో సులువుగా ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్.రావు, విభాగాధిపతి జగదీషన్, కో–ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### ముగ్గురికి తీవ్ర గాయాలు

**శంకరపట్నం:** వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలంలోని బూడిదపల్లికి చెందిన పడాల వెంకటస్వామి, రాజేశ్వరి బుధవారం మోటార్‌సైకిల్‌పై శంకరపట్నం మండలంలోని మొలంగూర్ గ్రామానికి వెళ్తున్నారు. అదే సమయంలో మొలంగూర్‌కు చెందిన తడిగొప్పుల సంపత్ బైక్‌పై ఎదురుగా రావడంతో రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వెంకటస్వామి, సంపత్‌లు తీవ్రంగా గాయపడ్డారు. 108 సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. కన్నాపూర్‌లో నడుచుకుంటూ వెళ్తున్న గట్టయ్యను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలవడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

# బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి





మంత్రి ప్రభాకర్‌గౌడ్‌కు వినతిపత్రం ఇచ్చిన సమిరెడ్డి, మంత్రితో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు

**జమ్మికుంట:** జమ్మికుంట పట్టణం నుంచి ఇతర ప్రాంతాలకు రద్దు చేసిన బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు వినతిపత్రం అందించారు. జమ్మికుంట నుంచి హైదరాబాద్‌కు లగ్జరీ బస్సు, కుందనపల్లికి సిరిసేడు, పర్లపల్లి మీదుగా, కుందనపల్లికి వావిలాల మీదుగా, జమ్మికుంట నుంచి బొంతుపల్లి, కొండపాక, హిమ్మత్‌నగర్ గ్రామాలకు, జమ్మికుంట నుంచి మొగుళ్లపల్లి, పర్కాలకు, జమ్మికుంట, శ్రీరాములపల్లి, కనగర్తి, గుండేడు గ్రామాల మీదుగా హనుమకొండకు బస్సులు నడపాలని విన్నవించారు. ఆయన వెంట కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య ఉన్నారు.

**మంత్రిని కలిసిన నాయకులు**

**చిగురుమామిడి:** మండలంలోని లంబాడిపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిశారు. గ్రామానికి చెందిన కాటం కిషన్‌రెడ్డి కుమారుడికి ఫిట్స్ రాగా బంజారాహిల్స్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, ఆర్థికసాయం అందించాలని కోరారు. స్పందించిన ఆయన చికిత్సకు హామీ ఇచ్చారు. అలాగే, లంబాడిపల్లిలో అభివృద్ధి పనుల కోసం రూ.20 లక్షలు మంజూరు చేయాలని విన్నవించారు. కాంగ్రెస్ నాయకులు కాటం సంజీవరెడ్డి, సంపత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నాగెల్లి రాజిరెడ్డి, బండారిపెల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

- జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు



మొక్క నాటుతున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు

**జమ్మికుంట:** మున్సిపల్ పరిధిలోని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పట్టణ సుందరీకరణకు పాటుపడాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆధ్వర్యంలో వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మొక్కలు ప్రాణవాయువును అందించి, కాలుష్య నివారణకు తోడ్పడుతాయని పేర్కొన్నారు. నాయిని చెరువు ప్రాంతంలో 300 మొక్కలు నాటారు. అనంతరం మున్సిపల్ పరిధిలో చెత్తను సేకరించేందుకు, నీటి సరఫరాకు కొనుగోలు చేసిన రెండు ట్రాక్టర్లు, ట్యాంకర్‌ను ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న కోటి, మేనేజర్ భూపాల్‌రెడ్డి, ఏఈ వరుణ్, కౌన్సిలర్లు, సీఎల్ఆర్పీలు, ఆర్పీలు, ఓబీలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాధనాన్ని వృథా చేయొద్దు




మాట్లాడుతున్న వికాస కేంద్రం నాయకులు

**హుజూరాబాద్:** వాస్తు పేరిట ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో నిర్మాణాలను కూల్చివేస్తూ ప్రజాధనాన్ని వృథా చేయొద్దని విజ్ఞాన వికాస కేంద్రం నాయకులు కోరారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని విజ్ఞాన వికాస కేంద్రం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో వాస్తు లోపం ఉందంటూ నిర్మాణాలను తొలగిస్తూ.. కొత్తగా చేపట్టడం సరికాదన్నారు. నిర్మలమైన మనసుతో ఆలోచిస్తే అన్నీ సరిగానే కనిస్తాయని పేర్కొన్నారు. నాయకులు రొంటాల బుచ్చయ్య, చొడమల్ల నాగరాజు, సంధ్యల వెంకన్న, వేల్పుల మల్లేశం, మొలుగూరి రమేశ్ తదితరులున్నారు.

# ‘ఆ ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోండి’



డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**హుజూరాబాద్:** భ్రూణ హత్యలకు కారణమవుతున్న హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ నాయకులు కోరారు. బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందుకు వినతిపత్రం అందించారు. కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ పేద ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు జంగ అనిల్, ఇప్పలపల్లి చంద్రశేఖర్, చల్లూరి విష్ణువర్ధన్, బీట్ల సాయితేజ, కొండ్ర నాగరాజు, బాలు తదితరులు పాల్గొన్నారు.

# ఆశవర్కర్లకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి



తిమ్మాపూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం శంకర్, ఆశవర్కర్లు



చిగురుమామిడి: నిరసన తెలుపుతున్న ఆశవర్కర్లు

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాతంగి శంకర్

**తిమ్మాపూర్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాతంగి శంకర్, ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) మండల అధ్యక్షురాలు నాయిని రజిత డిమాండ్ చేశారు. ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కోర్కెల దినం సందర్భంగా బుధవారం తిమ్మాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కనకయ్యకు వినతిపత్రం అందించారు. ఎన్‌హెచ్ఎస్ బడ్జెట్ పెంచాలని, ప్రైవేటీకరణ చేయవద్దని, ఆశవర్కర్లకు నష్టం కలిగించే పరీక్షలను రద్దు చేయాలని కోరారు. రైతులకు వెంటనే రైతు భరోసా, 18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళకు రూ.2,500, ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు, ఉపాధిహామీ కార్మికులకు రోజు కూలీ రూ.600 ఇవ్వాలని, ఏడాదికి 200 రోజులు పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి కాల్వ సురేశ్‌యాదవ్, వెంకటలక్ష్మి, జ్యోతి, అనిత, లక్ష్మి, స్వప్న, రజిత, భవాని, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

**మానకొండూర్ రూరల్:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై మానకొండూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశవర్కర్లు బుధవారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్‌హెచ్ఎస్ స్కీంను ప్రైవేటీకరణ చేయవద్దని, ఆశవర్కర్లకు నష్టం కలిగించే పరీక్షలను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. 15 రోజులు సమ్మెకు పిలుపునిచ్చామని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు దీక్ష చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్ష్మి, సునీత, కవిత, మనీష, అంజలి, స్వప్న, పద్మ, రాజేశ్వరి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

**శంకరపట్నం:** కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరుతూ శంకరపట్నం మండలంలోని ఆశవర్కర్లు బుధవారం తహసీల్దార్ అనుపమకు వినతిపత్రం అందించారు. రూ.10 వేల పెన్షన్‌తోపాటు ఇతర డిమాండ్‌లను నెరవేర్చాలని విన్నవించారు.

**చిగురుమామిడి:** స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశవర్కర్లు బుధవారం ప్లకార్డులు పట్టుకొని, నిరసన తెలిపారు. 19 ఏళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకు కనీస వేతనం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ నరేందర్‌కు అందించారు. ఆశవర్కర్ల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మారెల్ల శ్రీలత, మండలశాఖ అధ్యక్షురాలు నాగెల్లి పద్మ, సభ్యులు పద్మ, అంజలి, సరోజన, పుష్ప, మంజుల, శ్వేత, సంధ్య, కమల, సహిదాబేగం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**గంగాధర:** తమ డిమాండ్లు నెరవేర్చాలని ఆశవర్కర్లు కోరారు. బుధవారం కోరికల దినంగా పాటించాలని తెలంగాణ ఆశవర్కర్స్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు గంగాధర మండలంలోని ఆశవర్కర్లు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్ఎం స్కీంను రక్షించాలని, ఆశవర్కర్లను కార్మికులుగా గుర్తించి, రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని, రిటైరైనవారికి రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. శంకరమ్మ, షర్మిత, లక్ష్మి, సుమలత, నాగేశ్వరి, అనిత తదితరులు పాల్గొన్నారు.

# లో లెవల్ వంతెనలతో ఇబ్బందులు



లలితాపూర్ శివారులో లో లెవల్ వంతెన



అన్నారం గ్రామ శివారులో..

**మానకొండూర్‌రూరల్:** మండల కేంద్రం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల మధ్యలోని లోలెవల్ వంతెనలతో వాహనదారులు, ప్రయాణికులు కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. మానకొండూర్, అన్నారం, లలితాపూర్, పోచంపల్లి, జగ్గయ్యపల్లి, లింగాపూర్, వెల్ది గ్రామాల శివారుల్లో వంతెనలున్నాయి. మోస్తరు వర్షాలకే వాటి పైనుంచి నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. మరోవైపు వంతెనలు ధ్వంసంకావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. హై లెవల్ వంతెనలు నిర్మించాలని లేదంటే పాతవాటికి మరమ్మతు చేయించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో ఏటా వర్షాకాలంతో నానాతంటాలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హై లెవల్ వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాలని కోరుతున్నారు.

**వంతెన నిర్మించాలి**

**వీణవంక:** కనపర్తి–వీణవంక గ్రామాల మధ్య అండర్ బ్రిడ్జితోపాటు ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు తెగిపోయింది. వంతెన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా స్పందనలేదు. భారీ వర్షాలు కురిస్తే మళ్లీ తెగిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు అంటున్నారు. ఈ రోడ్డు మీదుగా కనపర్తి, బేతిగల్ గ్రామాల ప్రజలు నిత్యం మండల కేంద్రానికి వెళ్తుంటారు. ప్రమాదకరంగా ఉన్న రోడ్డుకు మరమ్మతు చేయించడంతోపాటు కనపర్తి శివారులో తెగిన అండర్ బ్రిడ్జి స్థానంలో వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

### సొంత ఖర్చుతో వంతెనకు మరమ్మతు



మరమ్మతు చేయిస్తున్న రాకేశ్‌రెడ్డి

**వీణవంక:** మండలంలోని నర్సింగాపూర్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు లోలెవెల్ వంతెన కూలిపోయింది. రాకపోకలకు ఇబ్బందులు కలగడంతో గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పట్టించుకోలేదు. దీంతో వారు ఈ విషయాన్ని ఇదే గ్రామానికి చెందిన కొమ్మిడి రాకేశ్‌రెడ్డికి చెప్పగా.. బుధవారం సొంత ఖర్చుతో మరమ్మతు చేయించాడు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి, అతన్ని అభినందించారు.